## క్లుప్తంగా

### పిల్లలు బడుల్లోనే ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

బలిజిపేట: పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో జీఈఆర్‌పై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థూల నమోదు నిష్పత్తి ప్రకారం శతశాతం నమోదు చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లతో కలిసి సర్వే నిర్వహించి బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భానుమూర్తి, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### గలావల్లిలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బలిజిపేట: గలావల్లిలో సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవం సందర్భంగా కమిటీ, ఎ.సన్యాశినాయుడుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రాగోలు జేమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, సుగర్, ఈసీజీ, ఎకో వంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కొందరికి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. శిబిరంలో వైద్యులు అరవింద్, అశిత గోపికుమార్, మౌనిక, గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

బలిజిపేట: నారాయణపురం ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు శనివారం నిర్వహించారు. వీధి కాలువలలో పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించి, బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ నిమిత్తం ఫాగింగ్ యంత్రం ద్వారా మందు స్ప్రే చేయించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మందులు పంపిణీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఓ భానుమూర్తి, ఈఓపీఆర్‌డీ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

పార్వతీపురం: సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన టి.జయరాం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

### ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

సాలూరు: ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0, స్వచ్ఛత హాయి సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు మున్సిపల్ కమిషనర్ జయరామ్, మెప్మా సీఎంఎం పుష్ప, తదితరులు బహుమతులు అందజేశారు.

# అందరి సహకారంతోనే బాలల హక్కులకు రక్షణ

- రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: అందరి సహకారంతోనే బాలల హక్కుల పరిరక్షణ సాధ్యపడుతుందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణంలో జగన్నాథపురంలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను పనిలో చేర్పించుకోవడం చట్ట విరుద్ధమన్నారు. బాలలను పాఠశాలల్లోనే చదివించేలా ప్రోత్సహించాలన్నారు. బాలలను పనుల్లో చేర్పించుకుంటే సంబంధిత యాజమానిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆర్థిక అవసరాలు ఆసరాగా తీసుకొని కర్మాగారాల్లో, షాపుల్లో, మెకానిక్ షెడ్డుల్లో, టిఫిన్ సెంటర్లలో ఇతరత్రా పనుల్లో బాలలను చేర్పించడం సరికాదన్నారు. బాల్య జీవితాన్ని చిదిమేయడం నేరమన్నారు. బాల్యం ఆనందకరంగా... సరదాగా... విద్యతోనే ముందుకు సాగాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బాలల హక్కులను వివరించారు. సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, సీనియర్ న్యాయవాది టి.జోగారావు, జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కుపై కేంద్రం మొండి వైఖరి విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మన్యం జిల్లా కార్యదర్శి వేణు

పార్వతీపురం టౌన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి సరికాదని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి మోదీ తొమ్మిది సంవత్సరాల పరిపాలన కాలంలో అటు కార్మికులకుగాని, రైతాంగానికిగాని, వ్యవసాయ కూలీలనుగాని దుకొనే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్రకు ఎంతో ఉపయోగకరమైన, ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసే ఆలోచనతో ఉండడం సరికాదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయకుండా అడ్డుకోవల్సిన పరిస్థితి ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందన్నారు. సీపీఎం ఉత్తరాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో ఆరు జిల్లాలు, 1150 కిలోమీటర్లు ఉక్కు రక్షణ బైక్‌యాత్ర చేపడుతున్నారని, పార్వతీపురం మన్యం జిల్లాలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పర్యటించనుందని తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అన్న సమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం టౌన్: మండలంలోని సంగంవలస గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన శనివారం నిర్వహించారు. గ్రామంలోని పెద్ద వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా యువత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన బొండపల్లి, ఎమ్మార్‌నగరం, ములగ తదితర గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనాలు

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుల నిమజ్జనాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మక్కువ బీసీ కాలనీ, కూరాకుల వీధి, నాయుడువీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగించి, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అలాగే అన్నసమారాధనాలు నిర్వహించారు.

## ఈకేవైసీ చేయించుకోవాలి



నిడగల్లులో వృద్ధురాలికి ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ సహాయకురాలు

సీతానగరం: మండలంలోని వ్యవసాయ సహాయకులు ఉదయం నుండి సాయంత్రం వరకూ గ్రామాల్లో వ్యవసాయ పంటలు పండిస్తున్న రైతులకు ఈకేవైసీ చేయడం జరుగుతుందని రైతులు సహకరించాలని ఏఓ ఎస్.అవినాష్ కోరారు. వ్యవసాయ సహాయకులు చేస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ మేరకు నిడగల్లులో మంచం పట్టిన వృద్ధురాలికి ఇంటికి వెళ్లి ఈకేవైసీ చేసారు. అలాగే రంగంపేట, జానుమల్లువలస, కాశీపేట గ్రామాల్లో జిరాయితీ భూములుండీ ఇంటినుండి కదల్లేని రైతుల ఇళ్లకు వెళ్లి వ్యవసాయ సహాయకులు ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రతిభ



పూజితను అభినందిస్తున్న ఉపాధ్యాయిలు, అధ్యాపకులు

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని వి. పూజిత నేషనల్ సైన్స్ సెమినార్ (రాష్ట్ర స్థాయి)కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎల్. స్వర్ణలత తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాలకు చెందిన సిబ్బంది శనివారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పూజిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## కార్మికుల సంక్షేమానికి కృషి

- ఎన్‌ఎంయూ నాయకులు





మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

సాలూరు: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ఎన్‌ఎంయూ కృషి చేస్తోందని ఆర్టీసీ ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, నర్సింగరావు, సింహయ్య, కోశాధికారి మోహన్, తదితరులు అన్నారు. యూనియన్ జిల్లా చైర్మన్ ఎ.టి.నాయుడు అధ్యక్షతన పట్టణంలో శనివారం నిర్వహించిన విజయోత్సవ సభలో వారు మాట్లాడుతూ, జీఓ 96 జారీ చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం – మన్యం, శ్రీకాకుళం జిల్లాల యూనియన్ అధ్యక్షులు, నాయకులు , కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## 'నాడు - నేడు' పనులు వేగవంతం



జెడ్పీహెచ్ పాఠశాలలో నాడు - నేడు పనులు పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పాచిపెంట: మనబడి నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ పాఠశాల, కేజీబీవీలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యాబోధనపై ఆరా తీశారు.

## బైక్‌యాత్రను విజయవంతం చేయండి



మామిడిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

సాలూరు: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపాలంటూ చేపడుతున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కోరారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపల్లిలో శనివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 20న నుంచి చేపడుతున్న బైక్‌ర్యాలీ ఆదివారం సాయంత్రానికి సాలూరు చేరుతుందన్నారు. బైక్‌యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు

- ఉపాధిహామీ పీడీ రామచంద్రరావు

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలపై ప్రజావేదికను శనివారం నిర్వహించారు. 2022 ఏప్రిల్1 నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల నివేదికను వెల్లడించారు. పలు గ్రామాల్లో తప్పుడు మస్టర్లు నమోదు చేసినట్లు, పనులు చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు ఫిర్యాదులు అందాయని, విచారణలో అవి నిజమని తేలితే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ ఎం.తిరుపతిరావు, గోవిందరావు, ఏపీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ జి.సంపత్ కుమార్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

- అధికారుల తీరుపై ఎంపీపీ అసంతృప్తి

గరుగుబిల్లి:

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు కాలయాపన చేయడం సరికాదని ఎంపీపీ ఉరిటి రామారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించిన పనులు ఎప్పటికప్పుడు పరిష్కారం కావడం లేదని, పనుల విషయంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దార్ జీవీ జనార్దన్‌ను ప్రశ్నించారు. గొట్టివలస రెవెన్యూ పరిధిలోని కొండను అటవీశాఖకు, మైన్స్ వారికి ఇవ్వడం వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని సుంకి సర్పంచ్ కె.రవీంద్ర; కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సకాలంలో మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీవీపురం ఎంపీటీసీ సీహెచ్ రూపవతి సభ దృష్టికి తీసుకువచ్చారు. నాగూరు గ్రామంలో పలువురు నిరుపేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను ఇంద్రాని క్లస్టర్ రైస్‌మిల్లు అసోసియేషన్‌కు అధికారులు ఎలా కేటాయిస్తారని నాగూరు సర్పంచ్ కె.శిరీష ప్రశ్నించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని రావివలస, గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.అరుణకుమారి, కె.కె.సాగర్ వర్మలు కోరారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఎంఈఓ ఎస్.నాగభూషణరావు, విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు, జేఈలు ఫరూక్ సైపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



రీ సర్వే పరిశీలిస్తున్న డిప్యూటీ ల్యాండ్ రికార్డ్స్ సర్వే అధికారి సూర్యారావు

సీతానగరం: జగనన్న భూ హక్కు – భూ రక్ష రీసర్వే కార్యక్రమంతో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా డిప్యూటీ ల్యాండ్ రికార్డ్స్' సర్వే అధికారి సూర్యారావు అన్నారు. మండలంలోని అంటిపేటలో డీటీ పి.చిట్టెమ్మ ఆధ్వర్యంలో రీసర్వే నిర్వహిస్తున్న గ్రౌండ్ ట్రూత్ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కిందట ప్రభుత్వ, జిరాయితీ భూములకు రీసర్వే జరిగిందని, అప్పటి నుంచి నేటి వరకు రీసర్వే జరగలేదన్నారు. దీంతో భూ వివాదాలు పెరిగాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక జగనన్న భూ హక్కు – భూ రక్ష కార్యక్రమం చేపట్టడంతో వివాదాలకు చెక్ పడనుందన్నారు. ఆయన వెంట గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## ఆయుష్ మందుల పంపిణీ



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ హేమాక్షి

సీతానగరం: ఆయుష్ మందులతో దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ తెర్లి హేమాక్షి అన్నారు. మండలంలోని కృష్ణారాయపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో కీళ్ల నొప్పులు, జలుబు దగ్గు, ఉబ్బసం, పొట్ట ఉబ్బరం, సుగర్, కాళ్లు, చేతులు తిమ్మెర్లు రావడం, మలబద్ధకం తదితర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలలో గుర్తించామన్నారు. కృష్ణారాయపురంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 80 మంది రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులున్నాయని తెలియజేసే గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందించడం జరుగుతుందన్నారు.

## చురుగ్గా కల్వర్టుల నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అన్నంనాయుడు

సీతానగరం: మండలంలోని కల్వర్టులు లేక రాకపోకలకు అవస్థలు పడుతున్న కృష్ణారాయపురం గ్రామ ప్రజల కష్టాలు తీరనున్నాయని సర్పంచ్ జి.అన్నంనాయుడు అన్నారు. కృష్ణారాయపురంలో కల్వర్టులు లేక ఇళ్లలో మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లగా కల్వర్టులు మంజూరు చేయాలని కోరడంతో రూ.4లక్షలు మంజూరు చేశారని తెలిపారు. దీంతో రెండు కల్వర్టులు నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్న కాలువలు నిర్మాణం చేస్తున్నామని అన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు తిరుపతిరావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని తెలిపారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు



వినాయకునికి లక్ష ఉండ్రాలతో నైవేద్యం

పార్వతీపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణంలో నెలకొల్పిన వినాయకుడికి శనివారం లక్ష ఉండ్రాళ్ల నైవేద్యంగా సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజ శ్రేయస్సు కోసం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఉషా ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఐ.ఉషారాణి, కొత్తా నాగేశ్వరరావు, పూసర్ల చిన్నికృష్ణ, కందుకూరి లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

## పశు దాణా విక్రయ కేంద్రాల పరిశీలన



పశుదాణా విక్రయ కేంద్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ చక్రధర్

పార్వతీపురం టౌన్: పశుదాణాను నాణ్యత ప్రమాణాలకు లోబడి పాడి రైతులకు విక్రయించాలని పశువైద్యాధికారి డాక్టర్ భోగి చక్రధర్ అన్నారు. పట్టణంలోని పలు పశుదాణ విక్రయ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పశుదాణ విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా, ఐఎస్ఐ మార్కుతో కూడిన పశుదాణాను విక్రయం చేపడుతున్నారా.. తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశుదాణ నమూనాలను సేకరించి వాటి నాణ్యతను పరిశీలించేందుకు నెల్లూరులోని ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. పశుదాణలో కల్తీలను అరికట్టేందుకు తనిఖీలను చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు లేకుండా పశుదాణాను విక్రయిస్తే సంబంధిత యజమానిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

## సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2 నేతృత్వంలో ఉమన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సికెల్ సెల్ ఎనీమియాపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది కె.నాగమణి వివరించారు. రోగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ సహచరులకు, గ్రామస్తులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, ఎం.శాంతి, పి.రామారావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 26న జాబ్‌మేళా

సీతంపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న పాలకొండ తమ్మినాయుడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వైటీసీ మేనేజర్ వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హెటిరో, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మెడ్‌ప్లస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు.